క్లుప్తంగా

అంగన్‌వాడీలో అన్న ప్రాసన

పలిమెల : మండలంలోని బూరుగ్గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పిల్లలకు రాగి లడ్డు అందించారు. సర్పంచ్ చుక్కమ్మ, పంచాయతీ కార్యదర్శి మదన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ అమిలి శివమ్మ, ఆయా శ్రీలత పాల్గొన్నారు.

చిట్యాల ఎస్సైగా రమేష్



చిట్యాల: చిట్యాల నూతన ఎస్సైగా జంగిలి రమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన గుర్రం కృష్ణప్రసాద్ ములుగు జిల్లా ఏటూరునాగారా నికి బదిలీ అయ్యారు. కాగా, ఎస్సై రమేష్ మహాముత్తారం, భూపాలపల్లిలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌లో పని చేసిన అనంతరం చిట్యాలకు వచ్చారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం

కాటారం: నేర నియంత్రణలో భాగంగా పోలీస్‌శాఖ ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల నిర్వాహణకు మండల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తోడ్పాటును అందించారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం అసోసియేషన్ ద్వారా రూ.30వేలు మంగళవారం సీఐ రంజిత్‌రావు, ఎస్సై-2 తమాషారెడ్డికి అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గట్టు సమ్మయ్య, అసోసియేషన్ సభ్యులు అల్లాడి చంద్రమౌళి, జక్కుల అజయ్ పాల్గొన్నారు.

నియామకం

కాటారం: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు బొడ్డు రాజబాబు నియమితులయ్యారు. మండల అధ్యక్షుడు తోట జనార్ధన్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు తోట జనార్దన్, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాజబాబు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కేసులు నమోదు

కాటారం: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే రెవెన్యూ శాఖాపరంగా చర్యలు తీసుకోవడం తోపాటు పోలీస్‌శాఖ ద్వారా కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ జివాకర్‌రెడ్డి హెచ్చరించారు. కాటారం శివారులోని సర్వే నంబర్ 41లో గల ప్రభుత్వ భూమిని పలువురు ఆక్రమించి సాగు చేయడానికి ట్రాక్టర్‌తో దున్నించారు. సమాచారం అందుకొన్న తహసీల్దార్ జివాకర్‌రెడ్డి, ఆర్‌ఐ వెంకన్న మంగళవారం భూమి వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. ఆక్రమణకు పాల్పడిన వారి వివరాలు తెలుసుకొని నమోదు చేసుకొన్నారు. హద్దు రాళ్లను తొలిగించి భూ విస్తీర్ణంపై ఆరా తీశారు. భూమి చుట్టూ వెంటనే కంచె ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆక్రమణకు ప్రయత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

భూపాలపల్లిరూరల్/టేకుమట్ల: కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన యువకులు గాలెంక రాజు, గాలెంక నరేష్ లు మంగళవారం భూపాలపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి గండ్ర సత్యనారాయణ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రేగొండ మండల బీసీ సెల్ మండల అధ్యక్షుడు వీరబ్రహ్మం, కమలాపూర్ మాజీ సర్పంచ్ సంతోష్ తదితరులు ఉన్నారు.

పనులు పూర్తి చేయాలి

మహాముత్తారం: వివిధ గ్రామాలకు మంజూరైన గ్రామపంచాయతీ భవననిర్మాణపనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈజీఎస్ సోషల్ ఆడిట్ పనులు పెండింగ్ ఉండకుండా చూడాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ లోన్ సర్వేను సకాలంలో పూర్తి చేసి ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి 5మొక్కలను పంపిణీ చేయాలని తెలిపారు. అనంతరం మండలంలోని ములుగుపల్లి గ్రామ పంచాయతీలోని నర్సరీని పరిశీలించారు.

విజయవంతం చేయాలి

టేకుమట్ల(రేగొండ): ఈ నెల 8న హనుమకొండలో ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యే బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటిసారి ప్రధాని నరేంద్ర మోదీ ఉమ్మడి వరంగల్ జిల్లాకు వస్తున్న సందర్భంగా పెద్దఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యుగదీశ్వర్, నిశీధర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, మనోహర్, అశోక్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘననివాళి

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా సాయిలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, మల్లయ్య, మహేందర్, శ్రీనివాసరెడ్డి, సురేష్, నరేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ఇప్పలపల్లిలో..

మల్హర్: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని యూవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కత్తెరశాల కొమురయ్య, కుమార్, రమేష్, వెంకటయ్య, రాజయ్య, రాజు, పోషక్క, గట్టురాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య ఆశయాలు కొనసాగించాలి

భూపాలపల్లి రూరల్: దొడ్డి కొమురయ్య ఆశయాలు కొనసాగించాలని కురుమ సంఘం జిల్లా నాయకుడు కోరె సుధాకర్ కురుమ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని కోరె సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. నీల రమేష్, ఇంద్ల రవి, కడారి నవీన్, చేపూరి ఓదెలు, ఒగ్గు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉడత మల్లయ్య, దివ్యాంగుల సంఘం నాయకులు మల్లన్న, భారతీయ జనతా పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తోట ఓదేలు, కరివేద మనోహర్ నివాళులర్పించినవారిలో ఉన్నారు.

మహదేవపూర్: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు లచ్చయ్య పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరటానికి ఆధ్యుడు కొమురయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో యాదవ సంఘం యూత్ అధ్యక్షుడు బాపు, తహసీల్దార్ మాధవి, పలిమెల తహసీల్దార్ స్రవంతి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకుడు మోతె సాంబయ్య, రజక సంఘం నాయకుడు చెన్నూరి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



మహదేవపూర్: కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


మల్హర్: ఇప్పలపల్లిలో..


భూపాలపల్లి రూరల్‌లో..

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల వితరణ

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ అందించాలనే లక్ష్యంతో కాటారం 58 బెటాలియన్ సీఆర్పీఎఫ్ జవాను మనోహర్ శ్రీకారం చుట్టిన గిఫ్ట్ ఏ స్కూల్ బ్యాగ్ కార్యక్రమం కొనసాగుతోంది. మండలంలోని మద్దులపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోన్న 31 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ చాలెంజ్ 2023 ద్వారా దాతలు సమకూర్చిన బ్యాగ్‌లను మంగళవారం ఎస్సై శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. మనోహర్ స్కూల్ బ్యాగ్ చాలెంజ్ -2023 పేరిట గిఫ్ట్ ఏ స్కూల్ బ్యాగ్ అనే నినాదాన్ని రైజ్ చేస్తున్నారు. దీంతో పలువురు దాతలు స్పందించి స్కూల్ బ్యాగ్‌లు సమకూర్చడంతో వాటిని విద్యార్థులకు అందజేస్తున్నారు. పేద విద్యార్థులకు సేవ చేయాలనే లక్ష్యంతో మనోహర్ ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అని ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి ఇన్‌చార్జ్ సర్పంచ్ గుండెపు రమేశ్, సీఆర్పీఎఫ్ జవాన్ మనోహర్, పంచాయితీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్, స్వచ్ఛంద సేవకులు కొట్టె సతీశ్, సుమన్, బాలరాజు, తిరుపతి, రాజశేఖర్, దుర్గారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బ్యాగ్ అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్, తదితరులు

చెక్కుల అందజేత

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన గడ్డం వికాస్, రాజేశ్వరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కాగా.. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్‌లు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు హరీష్, నాయకులు కోట రవి, వాల యాదగిరిరావు, మండల కోప్షన్ సభ్యుడు అయ్యూబ్‌ఖాన్, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మీర సమ్మయ్య, సదానందం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మధు

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ సౌకర్యాలు కల్పించడం లేదని ఏబీవీపీ వేల్పుల రాజ్‌కుమార్ ఆరోపించారు. విద్యరంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో ఏఓ మహేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస వసతులు కరువయ్యాయని, టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా మొండి వైఖరి అవలంభిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిపులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, శివాజీ, కృష్ణ, అరవింద్, తరుణ్, వినయ్, సాయిలు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అధికారులు అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీపీ వినోద


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వినోద

చిట్యాల: గ్రామాల అభివృద్ధికి మండల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ దావు వినోద అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వ్యవసాయ శాఖ ఏఈఓ రమణకుమార్ మాట్లాడుతూ.. వర్షాలు తక్కువగా ఉన్నాయని అధిక శాతం వర్షాభావం ఉంటేనే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. అగ్రోస్‌లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఒడితల పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ భావన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో సమావేశపు హాల్ లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే ఆస్పత్రి లోపల సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతున్న క్రమంలో లక్ష్మీపూర్‌తండా, సీఆర్ పల్లి గ్రామాల సర్పంచ్‌లు జవహర్‌లాల్, మధువంశీకృష్ణలు మా గ్రామాల్లో థర్డ్‌వైర్ లేక మధ్యాహ్నం పూట వీధిలైట్లు వెలుగుతున్నాయని తెలిపారు. గతంలో పల్లె ప్రగతిలో విద్యుత్ అధికారులు సక్రమంగా ఏ పని చేయలేదన్నారు. లక్ష్మీపూర్ తండాలో గిరివికాస్ పథకంలో ఏడు బోర్లు మంజూరయ్యాయని ఇంత వరకు విద్యుత్ సరఫరా కాలేదని తెలిపారు. దీంతో స్పందించిన ఏఈ డీఆర్‌డీఏలో ఆన్‌లైన్‌లో రిజిస్టేషన్ చేసుకోవాలని కోరారు. అలాగే మండలంలోని బావుసింగ్‌పల్లి, లక్ష్మీపూర్ తండా గ్రామాల్లో ఉన్న చెంచులకు సంబంధించిన భూములకు పట్టాలు అందించి వారిని అదుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన తహసీల్దార్ రెండు గ్రామాలకు చెందిన చెంచులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయం నుండిచి చలివాగు వరకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదని ఎంపీటీసీ కట్కూరి పద్మ సభ దృష్టికి తీసుకెళ్లింది. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని గ్రామాల్లో కొంత మేరకు చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని అధికారులు వాటిని పరిష్కరించాలని కోరారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ సుమన్, పీఆర్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎంపీటీసీల సంబురాలు..

ఎంపీటీసీ సభ్యులుగా గెలిచి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీతోపాటు సభ్యులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఎంపీపీ దావు వినోదను శాలువాలతో సన్మానించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

టేకుమట్ల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంక అన్నారు. వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని రామకిష్టాపూర్(టి)లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన 89 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ముగ్గురి రక్త నమూనాలను సేకరించి మందులను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఈగలు, దోమల నుంచి రక్షించుకోవచ్చనని అన్నారు. కాచి వడబోసిన నీటినే తాగాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గునిగంటి మహేందర్, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సంగీతారాణి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్త సుజాత, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

పలిమెల : బీసీ చేతి, కుల వృత్తులవారిలో రూ.లక్ష ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో మంగళవారం మండల స్పెషల్ ఆఫీసర్ సుధీర్, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా కులాల పనిముట్ల కొనుగోలు, ఆధునికీకరణ, ముడి సరుకు కొనుగోలుకు మాత్రమే ఆర్థిక సాయం అందిస్తారని, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వృత్తుల అభ్యున్నతికి ఆర్థిక సాయం అందిస్తారని స్పష్టం చేశారు.

అర్హులకు న్యాయం చేయండి

టేకుమట్ల: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్ నియామకాల్లో ఎంపిక చేసిన అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఆరు నెలల క్రితం కేజీబీవీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయగా వచ్చిన దరఖాస్తుల ద్వారా ఎంపికైన వారిని పాఠశాలలో వారం రోజుల పాటు పని చేయించుకుని ఇప్పుడు కాదనడం సరికాదన్నారు. రాజకీయ నాయకుల జోక్యంతో వారిని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని, అది పూర్తిగా ప్రభుత్వ నియమావళికి విరుద్ధమని అన్నారు. ప్రజాసేవ చేయాల్సిన నాయకులే ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కలెక్టర్ నియమించిన వారినే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆస్పత్రిలో సదరం క్యాంపు

చిట్యాల: మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో మంగళవారం సదరం క్యాంపు నిర్వహించినట్లు అడిషన్ డీఆర్డీఓ సురేష్ తెలిపారు. ఈ శిబిరానికి దివ్యాంగులు తరలివచ్చారని పేర్కొన్నారు. ఆర్థోకు 50మంది దరఖాస్తు చేసుకోగా 29 మంది హాజరైనట్లు తెలిపారు. ఈఎన్‌టీ కి 21 మందికి 20 మంది, ఎంఐ ఎమ్మార్‌కు 30మందికి 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి వైకల్యం ఆధారంగా సదరం ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ క్యాంపులో వైద్యులు చందు నాయక్, రాజునాయక్, అభిషేక్, దివిజ, డీపీఎం రవి, ఏపీపీఎంలు మంజుల, ప్రకాష్, సిబ్బంది తిరుపతి, శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.


శిబిరంలో పత్రాలను పరిశీలిస్తున్న వైద్యులు

అందుబాటులో గడ్డి విత్తనాలు

భూపాలపల్లి రూరల్: పాడి పశువులకు గడ్డికి సంబంధించి గడ్డివిత్తనాలు జంగేడు పశు, వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, సబ్సిడీపై అందించనున్నట్లు మండల పశువైద్యాధికారి తిరుపతి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

మొగుళ్లపల్లి: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఎంపికలు ఈనెల 6న గురువారం మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ ప్రభాకర్ మంగళవారం తెలిపారు. 6న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాల్గో తరగతి విద్యార్థులు 01-09-2014 నుంచి 31-08-2015 మధ్యలో పుట్టిన వారై, మూడో తరగతి పాసై ఉండాలని తెలిపారు. ఐదో తరగతి కోసం 01-09-2013నుంచి 31-08-2014 మధ్యలో పుట్టిన వారై, నాల్గో తరగతి పాసై ఉండాలని సూచించారు. ఆసక్తి గల క్రీడకారులు పుట్టిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు

మహదేవపూర్: మావోయస్టులకు సహకరంచొద్దని మహదేవపూర్ ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాంలో భాగంగా గురువారం మండలంలోని పెద్దంపేట గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే మావోయిస్టులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని ఇందుకు కఠిన చర్యలు ఉంటామని హెచ్చరించారు. మావోయిస్టుల గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. గ్రామంలోకి అనుమానితులు కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా సమాచారం అందించాలని కోరారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

చిట్యాల: ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలను నడపొద్దని చిట్యాల ఎస్సై రమేష్ అన్నారు. మండలంలోని జడల్‌పేట గ్రామ శివారులో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న 17 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు నంబర్ ప్లేట్, సరైన పత్రాలు కలిగి ఉండాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో సెకండ్ ఎస్సై ఎండీ షాఖాన్, పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్ తదితరులు ఉన్నారు.


పత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై రమేష్

వ్యక్తి మృతి

మహాముత్తారం: గడ్డి మందుతాగి చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నల్లగుంటవీ ఎనాజీపేట గ్రామానికి చెందిన చీర్ల మహేశ్ (30) కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తుంటాడు. వ్యవసాయంలో నష్టాలు రావడంతోపాటు చేసిన అప్పులు తీరక పోవడంతో కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో గ్రామశివారులోని మామిడి తోట వద్ద రెండు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. సోదరుడు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాజయ్య తెలిపారు.

ఇద్దరికి గాయాలు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సెకండ్ ఎస్సై ఎండీ షాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం పోనగల్లు గ్రామానికి చెందిన అల్లా సుధాకర్ అతని భార్య లావణ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై చిట్యాల మోడల్ స్కూల్‌కు టీసీ కోసం వస్తున్న క్రమంలో చల్లగరిగ గ్రామానికి చెందిన బండి సత్యంకు చెందిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో సుధాకర్, లావణ్య దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. అదేసమయంలో అటు వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ గాయాల పాలైన దంపతులను చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. సుధాకర్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు బండి సత్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోషకాహారం పంపిణీ

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం మహాముత్తారం ఎంపీడీఓ శంకర్‌నాయక్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేసిన రాగిలడ్డు పోషకాహారాలను పిల్లలు, గర్భిణులకు పంపిణీ చేశారు.

చేనేత కార్మికులకు అవగాహన సదస్సు

మహదేవపూర్: టాస్సార్ కాలనీలో రాష్ట్ర చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత సహకార సంఘం డీఎం క్రిష్ణహరి మాట్లాడారు. కార్మికుల పనితీరు మెరుగుపర్చుకునేందుకు నూతన పరికరాలు ఇవ్వనున్నట్ల చెప్పారు. నూతన డిజైన్‌లను తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ డీఈఓ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్, సునిత, సుమలత, రవికుమార్, బాపు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నూతన కమిటీ ఎన్నిక

పలిమెల: గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ మండల నూతన కమిటీని సీఐటీయూ జిల్లా ఇన్‌చార్జ్ జిమిడ రాజబాబు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంకెన గ్రామానికి చెందిన కలుగూరి నాగయ్య, ఉపాధ్యక్షుడిగా మట్టి కృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్గం సడవలిని, కోశాధికారిగా చెన్నూరి బాపు, సహాయ కార్యదర్శిగా కేదారి శ్రీనివాస్ ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా ఇన్‌చార్జ్ రాజబాబు తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

భూపాలపల్లి అర్బన్: మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కొమ్ము ఆకాశ్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఆకాశ్‌ను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ప్రతి ఏడాది పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీ ఎంపిక కావడం సంతోషకరమైన విషయమని ప్రధానోపాధ్యాయులు అమరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రచారి, సురేందర్, ప్రసాద్, కార్తీక్, శ్రీలత, షహిదాబేగం, రజియాలు పాల్గొన్నారు.


ఆకాశ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు